

సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి పల్వన్‌కుమార్

నాణ్యమైన వైద్యసేవలు అందించాలి

● జిల్లా వైద్యాధికారి పల్వన్ కుమార్

సిద్దిపేటరూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని, గర్భిణులకు, తల్లిబిడ్డల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి బీ.పల్వన్‌కుమార్ సిబ్బందికి సూచించారు. బుధవారం సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు మరియు నారాయణరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి హాజరు పట్టికను, రక్త నమూనాలను సేకరించే విధానాన్ని, రికార్డులను, ఫార్మసీ స్టోర్‌ను పరిశీలించారు. ఫార్మసిస్ట్ స్టాక్ రిజిస్టర్‌ను సక్రమంగా నిర్వహించడం లేదని, వ్యాక్సిన్ టెంపరేచర్ చార్ట్ వినియోగించడం లేదని, ఈడీడీ లైన్ లిస్ట్‌ను అందుబాటులో ఉండేలా చూసుకోవాలని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం నారాయణరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో లేబర్ రూంను సందర్శించారు. అత్యవసర మందులు, స్టెరిలైజ్డ్ కిట్స్ అందుబాటులో లేకపోవడం ఏంటని సిబ్బందిని ప్రశ్నించారు. ఆరోగ్యకేంద్రాల్లో అన్నిరకాల మందులు అందుబాటులో ఉండాలని చెప్పారు. ఆయన వెంట ఎంహెచ్ఎన్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆనంద్‌రావు, వైద్యాధికారులు వినోద్ బాబ్జి, ఉదయ్ కుమార్, బాపురెడ్డి, హెచ్ఈ పాండు రంగాచారి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి

కంది, సంగారెడ్డి మండలాల కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తలతో సమావేశమైన టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, సీనియర్ నేత చెర్యాల ఆంజనేయులు

సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల ఎమ్మెల్సీగా కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని కాంగ్రెస్ కార్యకర్తలకు టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, సీనియర్ నేత చెర్యాల ఆంజనేయులు పిలుపునిచ్చారు. సంగారెడ్డి, కంది మండలాల కాంగ్రెస్ కార్యకర్తలతో సంగారెడ్డి సమీపంలోని ఓ హోటల్‌లో బుధవారం వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి ఓట్లు వేయించాలని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున అభివృద్ధి మరింత సాధ్యమవుతుందన్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు పూర్తయ్యే వరకు ప్రతీ కార్యకర్త సైనికుల్లా ప్రజల్లో ఉంటూ పనిచేయాలని నిర్మలా జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి ఆంజనేయులు, కాంగ్రెస్ నాయకులు బుచ్చిరాములు, సందీప్ రెడ్డి, రఘుగౌడ్, రుద్రారం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కార్యకర్తలు



సంగారెడ్డి మండల కాంగ్రెస్ కార్యకర్తలతో సమావేశమై ఎమ్మెల్సీ ఎన్నికలపై సూచనలు చేస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

అంగన్‌వాడీల్లో ప్రీ స్కూల్ విద్య

- పిల్లలకు నెలకో అంశంపై మెలకువల బోధన
- నేర్పించేందుకు టీచర్లకు శిక్షణ
- పాఠశాలలపై ఆసక్తి కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు

7

ఇరుకు వంతెనతో ఇక్కట్లు

- సిరిసిల్ల-సిద్దిపేట రోడ్డులో తరచూ ప్రమాదాలు
- ప్రముఖ క్షేత్రం వేములవాడకు ఇదే ప్రధాన రహదారి
- భయాందోళనలో వాహనదారులు

8

అన్ని అంశాలను దృష్టిలో పెట్టుకుని మున్సిపల్ బడ్జెట్ రూపొందించాలి

● కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్/సిద్దిపేట రూరల్/ సిద్దిపేట కల్చరల్ ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల బడ్జెట్‌లో అన్నిఅంశాలను దృష్టిలో పెట్టుకుని రూపొందించాలని మున్సిపల్ అధికారులను కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో వచ్చే ఆర్థిక సంవత్సర మున్సిపల్ బడ్జెట్ ప్రిపరేషన్‌పై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ యొక్క ఆదాయ వనరులైన ఇన్‌కంట్యాక్స్, ప్రాపర్టీ టాక్స్, ఇతరత్రా గ్రాండ్‌లను దృష్టిలో పెట్టుకోవాలన్నారు. వచ్చిన ఆదాయంలో మున్సిపల్ సిబ్బంది జీతాలు, ఎలక్ట్రిసిటీ బిల్, వాటర్ సప్లయ్, శానిటేషన్ పనులతో పాటు తప్పనిసరిగా బడ్జెట్‌లో 10 శాతం గ్రీన్ బడ్జెట్ పెట్టాలని సూచించారు. మున్సిపాలిటీల్లో టాక్స్ కలెక్టర్ మార్చి 15 వరకు పూర్తిచేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్, మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్, మల్లికార్జున్, నర్సయ్య, శ్రీనివాస్‌రెడ్డి, నాగేందర్, పబ్లిసిటీ హెల్త్ డీఈలు మహేష్, ప్రేరణ, మెప్మాపీడీ హన్మంత్‌రెడ్డి, ఏఈ ఆర్ఐలు తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలి

గురుకుల విద్యాలయాల్లో, సంక్షేమ వసతి గృహాల్లో సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ ఎం.మనుచౌదరి అన్నారు. బుధవారం నారాయణరావుపేట మండలం గుర్రాలగొంది గ్రామంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు తాగునీటి కోసం ఆర్వోప్లాంట్ కావాలని ఉపాధ్యాయులు కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఆయన వెంట ఆర్ఐ అర్జున్ రెడ్డి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ దుర్గారెడ్డి, పంచాయితీ కార్యదర్శి అరుణ, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

● సిద్దిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఎదురుగా ఉన్న షెడ్యూల్ కులాల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న సమీకృత వసతి గృహాల సముదాయ భవనాన్ని కలెక్టర్ సందర్శించారు. హాస్టల్లో 235 మంది విద్యార్థులకు కల్పిస్తున్న ఆవాస, భోజన సౌకర్యాలను పరిశీలించారు. కిచెన్ రూంలో పరిశుభ్రతను, స్టోర్ రూమ్‌లో వంట సామాగ్రిని పరిశీలించారు. మెనూ ప్రకారం ఆహారం అందించాలన్నారు.



అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

సాగునీరు అందించాలి

● ఎడమ కాలువ చివరి గ్రామాలకు నీరందడం లేదని రైతుల రాస్తారోకో

సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి); రంగనాయక సాగర్ ఎడమ కాలువ ద్వారా గ్రామాలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ బుధవారం సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ చౌరస్తాలో ఆయా గ్రామాల రైతులు రాస్తారోకో చేపట్టారు. ఎడమ కాలువ నుంచి నారాయణరావుపేట మండలం మల్యాల, బంజేరుపల్లి, కోదండరావుపల్లి, ఇబ్రహింపూర్ గ్రామాలకు సాగునీరు అందడం లేదని అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాస్తారోకో విషయం తెలుకున్న ఇరిగేషన్ ఈఈ గోపాలకృష్ణ రైతులకు సర్దిచెప్పారు. నీటిని విడుదల చేయడంలో అధికారులు పక్షపాత వైఖరి అవలంబిస్తున్నారని రైతులు ఈఈ గోపాలకృష్ణతో వాగ్వాదానికి దిగారు. నీటి సరఫరాలో ఎలాంటి సమస్యలు రాకుండా చేస్తామని హామీ ఇవ్వడం శాంతించారు. పీఏసీఎస్ డైరెక్టర్ మోహన్ రెడ్డి, బంజేరుపల్లి మాజి సర్పంచ్ రోమాల శంకర్, బీఆర్ఎస్ నాయకులు చందు, మధు తదితరులు ఉన్నారు.



రాఘవాపూర్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న ఆయా గ్రామాల రైతులు

చితి తంటాలు

- పేరుకే వైకుంఠధామాల నిర్మాణం.. చాలాచోట్ల నిరుపయోగం
- నిర్వహణ లోపంతో అంత్యక్రియలకు దూరం
- లక్ష్యం చేరాలని అప్పట్లో ఎక్కడబడితే అక్కడ నిర్మాణాలు
- నీటి వసతి, సౌకర్యాలపై దృష్టిపెడితే ప్రయోజనం
- చివరి మజిలీ కోసం పల్లెల్లో తప్పని కష్టాలు

మనిషి చనిపోయిన బాధలో ఉన్నవాళ్లకు మరింత బాధను కలిగించేలా వైకుంఠధామాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. పల్లెల్లో నిర్మించిన వైకుంఠధామాల పరిస్థితి ప్రస్తుతం అధ్వానంగా తయారైంది. గత ప్రభుత్వ హయాంలో రూ. 10లక్షల పైచిలుకు ఖర్చుతో ఊరూరా వీటిని నిర్మించారు. కొన్నిచోట్ల అంత్యక్రియలకు ఉపయుక్తంగా ఉన్నప్పటికీ చాలాగ్రామాల్లో అనేక సమస్యలు వెంటాడుతున్నాయి. చిన్నపాటి సమస్యలను పరిష్కరిస్తే చాలావరకు వినియోగంలోకి వస్తాయి. అందుకే చివరి మజిలీ కష్టాలపై 'ఆంధ్రజ్యోతి' ఫోకస్ పెట్టగా అనేక విషయాలు వెలుగుచూశాయి.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, ఫిబ్రవరి 19



కొండపాక మండలం బందారంలో చెరువులోనే వైకుంఠధామం

పల్లెప్రగతిలో భాగంగా ప్రతీ గ్రామంలోనూ వైకుంఠధామం నిర్మించారు. గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ స్థలాలతో పాటు దాతల నుంచి సేకరించిన భూములను ఇందుకోసం కేటాయించారు. సొంత భూములు లేనివారికి ఇవి ఉపయోగపడతాయని భావించారు. దహనం చేసే గద్దెలతోపాటు స్నానాల గదులు, హాల్ నిర్మించారు. నీటి సౌకర్యం కోసం బోర్లు కూడా వేశారు. అయితే కొద్దిరోజుల పాటు సజావుగా నిర్వహించినప్పటికీ ఆ తర్వాత పట్టించుకునేవారు లేక నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. విద్యుత్ సౌకర్యం లేక బోర్లు పనిచేయడం లేదు. వైకుంఠధామాల వద్ద లైట్లు వెలగకపోవడంతో భయాందోళనకు గురవుతున్నారు. వైకుంఠధామాలకు వెళ్లడానికి దారులు సరిగా లేక అంత్యక్రియలకు ఇటువైపు చూడడం లేదు.

మిగతా 8వ పేజీలో...



చేర్యాల పట్టణంలో అసంపూర్తిగా నిలిచిన వైకుంఠధామం పనులు

నిరుపయోగం.. నిధులు దుర్వినియోగం

● రాయపోల్ మండలం వీరారెడ్డిపల్లిలో వైకుంఠధామం నిర్మాణాన్ని అసంపూర్తిగా నిర్మించి వదిలేశారు.

● కొండపాక మండలం బందారంలో చెరువు సమీపంలోనే వైకుంఠధామాన్ని నిర్మించారు. చెరువు నిండిన సమయంలో ఇది పూర్తిగా మునిగిపోతుంది. ఆ సమయంలో దహనానికి సొంతభూములు లేనివారు ప్రభుత్వ భూములనే ఆశ్రయిస్తున్నారు.

● వర్గల్ మండలం గౌరారంలో నిర్మించిన వైకుంఠధామంలో నీటి వసతి సక్రమంగా లేదు. స్నానం గదుల తలుపులు ఊడిపోయా యి. నిర్వహణ సరిగా లేక స్నానపు గదులే మరుగుదొడ్లుగా మారా యి.

● చేర్యాల మున్సిపాలిటీ పరిధిలో వైకుంఠధామం నిర్మాణం పనులను అర్ధాంతరంగా నిలిపివేశారు.

● మద్దూరు మండలంలో నిర్మించిన వైకుంఠధామాల నిర్వహణ అస్తవ్యస్థంగా మారింది. నీటి వసతి లేదు.

● బెజ్జంకి మండలం ముత్తన్నపేటలో నిర్మించిన వైకుంఠధామంలో నిర్వహణ లేక పిచ్చిచెట్లు, గడ్డి మొక్కలు ఏపుగా పెరిగాయి.

● జగదేవ్‌పూర్ మండలం ఇటిక్యాల లోని వైకుంఠధామం లో నీటి సౌకర్యం లేదు. స్నానాల గదులకు తలుపుల్లేవు.

● నారాయణరావుపేట మండలం శేఖర్ రావుపేట, సిద్దిపేట రూరల్ మండలం బచ్చాయిపల్లిలో వైకుంఠధామాలు లేవు.

● సిద్దిపేట అర్బన్ మండలం కిష్టసాగర్, బొగ్గులోని బండ, పొన్నాల గ్రామాలలో వైకుంఠధామాలు అసంపూర్తిగా ఉన్నాయి.

● అక్కన్నపేట మండలంలోని సగానికి పైగా గ్రామాల్లో వైకుంఠధామాల నిర్వహణ సక్రమంగా లేదు. నీటి సౌకర్యం లేకపోవడంతో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు.

● నంగునూరు మండలం అప్పలాయచెరువు వెళ్లే మార్గంలో వైకుంఠధామాలు నిర్మించినప్పటికీ ఎలాంటి వసతులు కల్పించలేదు. ఖాతా, అక్కెనపల్లి గ్రామాల్లో వాగు అవతలి భాగంలో ఉండడంతో అటువైపు వెళ్లడం లేదు. నర్మెటలో వాస్తు ప్రకారం నిర్మించలేదని అక్కడ దహనసంస్కారాలు చేయడం లేదు.



వర్గల్ మండలం గౌరారం వైకుంఠధామంలో స్నానపు గదుల దుస్థితి

జై భవానీ.. వీర శివాజీ

● సిద్దిపేటలో హిందూ వాహిని ఆధ్వర్యంలో భారీ ర్యాలీ
● శివాజీ చౌక్ వద్ద బహిరంగ సభ

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా కేంద్రంలో బుధవారం ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా హిందూ వాహిని ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయం నుంచి ర్యాలీ ప్రారంభమై సుభాష్ రోడ్, అంబేద్కర్ చౌరస్తా, విక్టర్ టాకీస్ చౌరస్తా, వీరసావర్కర్ చౌరస్తా నుంచి శివాజీ చౌక్ వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో హిందూ కార్యకర్తలు, బజరంగ్ దళ్, విశ్వ హిందూ పరిషత్ ఏబీవీపీ బీజేవైఎం బీజేపీ నాయకులు, హిందూభక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సిద్దిపేట జిల్లా కేంద్రంలో ర్యాలీ

ర్యాలీ అనంతరం శివాజీచౌక్ వద్ద బహిరంగ సభను ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతి స్వామి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రపంచ దేశాలు హిందు మతాన్ని ఆచరిస్తున్నాయని, భవిష్యత్తులో భారతదేశం హిందూ దేశంగా మారుతుందని తెలిపారు. నేటి యువత ఛత్రపతి శివాజీ మహారాజ్ అడుగుజాడల్లో నడిచి హిందూ ధర్మాన్ని కాపాడాలని సూచించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ అప్పన ప్రసాద్ జీఈ మాట్లాడారు. ఎందరో మహానుభావులు పుట్టిన దేశం భారతదేశం అని కొనియాడారు. భారతదేశ చరిత్ర గురించి శివాజీ పాలన గురించి తెలియజేశారు. సభలో చిన్నారుల నృత్యా లు, కళాకారుల బ్యాండ్ అందరినీ అలరించాయి. కార్యక్రమం లో హిందూ వాహిని నాయకులు వేణుమాధవ్, భూమిరెడ్డి, బస్వరాజు సత్యం, శివాజీ, లక్ష్మణ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



బ్యాండ్ కొడుతున్న కళాకారులు



బహిరంగసభలో మాట్లాడుతున్న భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతి స్వామిజీ

వన్ నేషన్.. వన్ డిసెబిలిటీ కార్డు

● దేశవ్యాప్తంగా దివ్యాంగులందరికీ ఒకే వైకల్య ధ్రువీకరణ పత్రం ● ఈ నెల నుంచే అమలులోకి..

మెదక్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులందరికీ దేశవ్యాప్తంగా ఒకే విధమైన వైకల్య ధ్రువీకరణ పత్రాన్ని కేంద్రం జారీ చేయనుంది. ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో యూడీఐడీ (యూనిక్ డిసేబిలిటీ ఐడెంటిటీ) కార్డులు అందుబాటులో ఉండగా ఈ నెల నుంచి మన రాష్ట్రంలోనూ అమలులోకి తెస్తున్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో అమలులో ఉన్న సదరం సర్టిఫికెట్లు ఇతర రాష్ట్రాల్లో చెల్లుబడి కావడం లేదు. దీంతో దివ్యాంగులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గతంలోనూ ఆన్‌లైన్‌లో యూడీఐడీ కార్డు కోసం దివ్యాంగులు దరఖాస్తు చేసుకునేవారు. కానీ జారీ కావడంలో తీవ్ర జాప్యం జరిగేది. ఆన్‌లైన్‌లో అప్లైచేసి ఏడాది గడుస్తున్నా రాలేదని దివ్యాంగులు వాపోతున్నారు. రానున్న రోజులలో యూడీఐడీ కార్డు ఉంటేనే దివ్యాంగులకు పెన్షన్లు, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హత కల్పిస్తారని సమాచారం. ప్రభుత్వ ఉద్యోగాలు నిర్వర్తిస్తున్న దివ్యాంగులు యూడీఐడీ కార్డు వివరాలను వారి సర్వీసు పుస్తకాల్లో ఎంటర్ చేసుకోవాల్సి ఉంటుంది.

సదరం క్యాంపుల్లోనూ జారీ

ఇప్పటికే పలువురు వైకల్య ధ్రువీకరణ పత్రాలను ఆన్‌లైన్‌లో పొందుతుండగా ఇక నుంచి సదరం శిబిరాలకు వచ్చే దివ్యాంగులందరికీ అందజేయనున్నారు. వైకల్య శాతం ఆధారంగా నిర్ధారిత రంగులలో జారీ చేయనున్నారు. కార్డు ఒక్కసారి ఇస్తే మళ్లీ వాటిని పునరుద్ధరించుకోవల్సిన అవసరం ఉండదు. బస్సులు, రైళ్లలో రాయితీతో పాటు దివ్యాంగులకు లభించే అన్ని సౌకర్యాలు యూడీఐడీ కార్డుల ద్వారా పొందవచ్చు.

మెదక్ జిల్లావ్యాప్తంగా 1,13,234 మంది వివిధ కేటగిరీలకు చెందిన ప్రభుత్వ పెన్షన్లు పొందుతున్నారు. వీరికి ప్రతీ నెలా రూ.25,74,28,432 అందుతున్నాయని తెలిపారు. ఇందులో 8,275 మంది దివ్యాంగులకు రూ. 3.40 కోట్లు ప్రభుత్వ ఖజానా నుంచి చెల్లిస్తున్నారు. భవిష్యత్తులో వీరందరూ వన్ నేషన్- వన్ డిసెబిలిటీ కింద యూడీఐడీ కార్డు పొందాల్సి ఉంటుంది. దివ్యాంగులు ఎప్పటి లాగానే జిల్లా ఆసుపత్రిలో నిర్వహించే సదరం శిబిరానికి హాజరు కావాల్సి ఉంటుంది. ఇందుకు గానూ మీ-సేవా కేంద్రంలో స్లాట్ బుక్ చేసుకోవాలి. శిబిరంలో పరీక్షల అనంతరం ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తారు. దివ్యాంగులకు సంబంధించి వివరాలు, వైకల్య శాతం వైద్యుల లాగిన్‌కు చేరుతుంది. వివరాలు పరిశీలించి అప్‌లోడ్ చేయగానే కార్డు మంజూరు అవుతుంది. కార్డు జారీ చేసే వారి డిజిటల్ సంతకంతో కూడి ఉంటుంది. దాని ప్రకారమే ప్రభుత్వం దివ్యాంగ పెన్షన్ మంజూరు చేస్తుంది.



ఉపాధ్యాయులు విద్యార్థులపై శ్రద్ధ చూపాలి

● మెదక్ డీఈవో రాధాకిషన్

శివ్వంపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మెదక్ డీఈవో రాధాకిషన్ ఆదేశించారు. మండల పరిధిలోని చండి, దొంతి, కొంతాన్‌పల్లి, శివ్వంపేట ఉన్నత పాఠశాలలను మెదక్ జిల్లా విద్యాధికారి రాధాకిషన్ ఆకస్మాత్తుగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ పాఠశాలలో విద్యార్థులకు ఉదయం అల్పాహారం ఇవ్వాలని తెలిపారు. విద్యార్థులు పరీక్షల సమయంలో మంచి ఆహారం తీసుకుని, సమయాన్ని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం తప్పకుండా ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. ప్రతీ పాఠశాలలోవందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషిచేయాలని టీచర్లకు సూచించారు. ఆయన వెంట ఎంఈవో బుచ్చానాయక్ తదితరులు ఉన్నారు.



నార్సింగ్ 44వ జాతీయ రహదారిలో భారీ వాహనంపై తీసుకెళ్తున్న పవర్ ట్రాన్స్‌ఫార్మర్

భారీ వాహనంపై పవర్ ట్రాన్స్‌ఫార్మర్ తరలింపు

చేగుంట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): 160 టైర్ల భారీ కంటైనర్ వాహనంపై 280 టన్నుల పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మెదక్ జిల్లా నార్సింగ్ మండల శివారులోని 44వ జాతీయ రహదారిపై నుంచి తరలించారు. తోషిబా కంపెనీకి సంబంధించిన ఈ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను హైదరాబాద్ నుంచి ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఝాన్సీ జిల్లాకు తరలిస్తున్నారు. పది నుంచి ఇరవై కిలోమీటర్ల వేగంతో రోజుకు 40 నుంచి 60 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేస్తున్నట్లు వాహనదారులు తెలిపారు. ఈ భారీ వాహనం జాతీయ రహదారిపై వెళ్లడంతో ప్రజలు అందరూ ఆసక్తిగా చూశారు.



మున్సిపల్ కార్మికులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

● ఆర్డీవో కార్యాలయం ఎదుట కార్మికుల ఆందోళన

జహీరాబాద్, ఫిబ్రవరి 19 : మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు ఇళ్ల స్థలాలను కేటాయించాలని సీఐటీయూ జిల్లా నాయకుల మైపాల్, మున్సిపల్ కార్మికులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. కార్మికులను అధికారులు, పాలకులు పట్టించుకోవడంలేదని నినదించారు. చాలిచాలని జీతాలతో కుటుంబాలను పోషించుకోలేక, ఇంకోవైపు ఇళ్ల అద్దెలను కట్టలేని పరిస్థితిలతో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. ఇళ్ల స్థలాలను కేటాయించి ఇదింరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

హైవే విస్తరణలో నాణ్యత లోపం

● విజిలెన్స్ అధికారులు విచారణ జరిపించాలి
● సీపీఎం సంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడు మాణిక్యం డిమాండ్


కంది, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : హైవే విస్తరణలో భాగంగా రోడ్డుకిరువైపులా నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు నాణ్యతగా లేవని, వెంటనే విజిలెన్స్ అధికారులు విచారణ జరిపించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు అతిమెల మాణిక్యం డిమాండ్ చేశారు. కంది శివారులో నిర్మిస్తున్న అండర్ డ్రైనేజీ పైకప్పు ఉన్నట్టుండి ఒక్కసారిగా బుధవారం కూలిపోయింది. ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోకుండా నేషనల్ హైవే అధికారులు వెంటనే ఆ స్థలంలో బారికేడ్లు ఏర్పాటు చేయించారు. ఆ స్థలాన్ని పరిశీలించిన సీపీఎం జిల్లా నాయకులు మాట్లాడుతూ హైవే విస్తరణ పనులు నాణ్యత లేకుండా నిర్మిస్తున్నందుకు కారణమైన కాంట్రాక్టర్, ఇంజనీర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. అనేకచోట్ల నాణ్యత లోపించడంతో నిర్మాణ దశలోనే కల్వర్టులు కూలిపోతున్నాయని ఆవేదన చెందారు. హైవే పనులు ఇలా నాణ్యత లేకుండా ఉంటే వాహనాదారులకు ప్రమాదకరమని తెలిపారు. ఉన్నతాధికారులు కల్పించుకుని వెంటనే విస్తరణ పనులు నాణ్యతగా ఉండేలా చూడాలని పేర్కొన్నారు.


గణిత విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ఖేడ్ ఉపాధ్యాయుడికి అవార్డు

నారాయణఖేడ్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశ స్థాయి గణిత విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ఖేడ్ పరిధిలోని ర్యాలమడుగు గణితం ఉపాధ్యాయుడు వినయ్‌కుమార్ అవార్డు దక్కించుకున్నారని, ఆయన మనకు గర్వకారణమని మండల విద్యాధికారులు మన్మథకిషోర్, రాజశేఖర్‌లు అన్నారు. బుధవారం నారాయణఖేడ్‌లో వినయ్‌కుమార్‌కు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఇటీవల వినయ్‌కుమార్ 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు గణితానికి సంబంధించిన అన్ని అంశాలను సులభంగా నేర్చుకోవడానికి ప్రాజెక్టు రూపొందించగా, ఇది రెండో అవార్డు దక్కించుకున్నదని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను ఉపాధ్యాయులు సన్మానించారు.


సైబర్ నేరాలపై విద్యార్థినులకు అవగాహన


పాపన్నపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలపై మహిళలు అప్రమత్తంగా ఉండాలని పాపన్నపేట ఏఎస్సై నంగన్న తెలిపారు. బుధవారం పాపన్నపేట మెయిన్ రోడ్డుపై ఏర్పాటు చేసిన మహిళా సదస్సులో ఆయన మాట్లాడుతూ అపరిచితుల నుంచి ఫోన్లు వస్తే జాగ్రత్తగా ఉండాలని కోరారు. ముఖ్యంగా ఓటీపీలు అడిగితే చెప్పొద్దని సూచించారు. పిన్ నంబర్లను ఇతరులతో పంచవద్దని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తుల నుంచి ఫోన్లు వస్తే, దగ్గరి వారికి ప్రమాదాలు జరిగినట్లు, సీరియస్‌గా ఉన్నట్లు చెపితే నమ్మవద్దని, సంబంధీకులకు ఫోన్ చేసి నిర్ధారించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాలల విద్యార్థినులు, సంతకు వచ్చిన మహిళలు, పోలీసులు పాల్గొన్నారు.
















క్రైం కార్నర్

బైక్‌పైకి దూసుకెళ్లిన టిప్పర్..
యువకుడి మృతి


ప్రకాశ్ (ఫైల్)

కొండాపూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : బైక్‌పైకి దూసుకెళ్లి కిందపడిన యువకుడిపై నుంచి టిప్పర్ వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన కొండాపూర్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం చోటుచేసుకున్నది. ఎస్ఐ హరిశంకర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మారేపల్లి గ్రామానికి చెందిన గంజాయి ప్రకాశ్(28) ఈనెల 16వ తేదిన చిన్నమ్మ కూతురి పెళ్లికి మల్కాపూర్ వచ్చాడు. బుధవారం మధ్యాహ్నం బైక్‌పై మల్కాపూర్ గ్రామానికి చెందిన జేమ్స్‌తో కలిసి కిరాణం సామాగ్రి తీసుకొని చిన్నమ్మ ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో గ్రామశివారు విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో డ్రైవర్ అతివేగంతో నడుపడంతో టిప్పర్ బైక్‌పైకి దూసుకెళ్లింది. బైక్ మీద నుంచి కిందపడిన ప్రకాశ్‌పై నుంచి టైర్లు ఎక్కడంతో కడుపు(పొట్ట)పగిలి అక్కకికక్కడే మృతి చెందాడు. వెనుకల కూర్చున్న జేమ్స్ పక్కన పడి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ప్రకాశ్ అన్న ప్రవీణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వొక్సాన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆత్మహత్య


సుమంత్‌కుమార్(ఫైల్)

మునిపల్లి, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి) : ఫ్యాన్‌కు ఉరేసుకుని ఓ ప్రొఫెసర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన కంకోల్ గ్రామ శివారులోని వొక్సాన్ యూనివర్సిటీలో బుధవారం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సుమంత్‌కుమార్(36) సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం కంకోల్ గ్రామ శివారులో గల వొక్సాన్ యూనివర్సిటీలో స్కూల్ ఆఫ్ ఆర్ట్ అండ్ డిజైనర్ ప్రొఫెసర్‌గా మూడేళ్ల నుంచి పని చేస్తున్నాడు. అయితే ప్రతీరోజు ఉదయం 9 గంటలకు విధులకు వెళ్లేవాడు. బుధవారం మధ్యాహ్నం 12గంటలు కావస్తున్న విధులకు హాజరుకాకపోడంతో తోటి ప్రొఫెసర్లు ఆయన ఉండే రూమ్‌లోకి వెళ్లి చూడగా, ఫ్యాన్‌కు నైలన్ తాడుతో ఉరేసుకుని కనిపించాడు. దీంతో ఈ విషయాన్ని యూనివర్సిటీ సిబ్బంది స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. మునిపల్లి ఎస్ఐ రాజేష్ నాయక్ హుటాహుటినా సంఘటన స్థలానికి చేరుకొని అక్కడి పరిస్థితులను పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేష్‌నాయక్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సదాశివపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అప్పుల బాధతో యువకుడు..


వెంకటేశ్ మృతదేహం

వర్గల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : అవసరం కోసం తీసుకున్న అప్పులు చెల్లించే మార్గం లేకపోవడంతో జీవితంపై విరక్తిచెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన వర్గల్ మండల పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గౌరారం గ్రామానికి చెందిన చింతల వెంకటేశ్(30) ప్రైవేటు ఉద్యోగం చేస్తుంటాడు. ఇటీవల కాలంలో అతడికి రూ.5 లక్షల వరకు అప్పులయ్యాయి. అప్పుల వారు ఇచ్చిన డబ్బులు అడుగుతండగా, చెల్లించే మార్గం కనిపించకపోవడంతో తీవ్రమనస్తాపనికి గురై మంగళవారం రాత్రి ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య రమ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చెరువులో ఈతకు వెళ్లి ఇద్దరి మృతి

జిన్నారం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): చెరువులో స్నానం కోసం వెళ్లి ప్రమాదవశాత్తు ఇద్దరు మృతిచెందిన ఘటన వావిలాల పీర్లా చెరువు వద్ద జరిగింది. జిన్నారం ఎస్ఐ నాగలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా చర్చి గాగిల్లాపూర్‌కు చెందిన వల్లపు నరేష్(26), అతడి స్నేహితుడు పల్లపోలు శంకర్(22) మంగళవారం వావిలాల శివారులో ఓ కల్లు దుకాణంలో కల్లు తాగి, సమీపంలో ఉన్న పీర్లా చెరువులో స్నానం కోసం వెళ్లారు. చెరువులో దిగి గల్లంతు అవుతున్న వీరిని పశువుల కాపరులు గుర్తించి కాపాడే ప్రయత్నం చేసినా ఫలించలేదు. బుధవారం గజ ఈతగాళ్ల సహాయంతో చెరువులో గాలింపు చేపట్టి, ఇద్దరి మృతదేహాలను వెలికి తీశారు. మృతుల్లో వల్లపు నరేష్ వివాహితుడు కాగా, అతడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

కంది, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కందిలోని దేవుని చెరువులో బుధవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనిపించగా స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వారు ఫైర్ సిబ్బంది సహాయంతో చెరువులోంచి మృతదేహాన్ని వెలికితీశారు. వెంటనే మృతదేహానికి పంచనామా నిర్వహించి సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. సంగారెడ్డి రూరల్ ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడికి సుమారు 35 సంవత్సరాల వయస్సు ఉండవచ్చని, చనిపోయి మూడు రోజులకుపైగానే అవుతున్నట్లు తెలుస్తుందని పేర్కొన్నారు. మృతుడి ఒంటిపై ఆరోగ్య సంస్థకు చెందిన బ్లూ టీషర్ట్ ఉందన్నారు. మృతుడిని ఎవరైన గుర్తుపడితే సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రంగాయపల్లి స్టీల్ పరిశ్రమలో మంటలు


పరిశీలిస్తున్న తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి తదితరులు

మనోహరాబాద్ ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రంగాయపల్లి స్టీల్ పరిశ్రమలో అగ్నిప్రమాదం సంభవించిన ఘటన మండల పరిధిలో బుధవారం చోటుచేసుకున్నది. ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండలం రంగాయపల్లి గ్రామంలో ఎమ్ఎస్ అగర్వాల్ స్టీల్ పరిశ్రమలో బుధవారం మధ్యాహ్నం షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. పరిశ్రమ సిబ్బంది, ఫైరింజన్, అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అగ్నిమాపక యంత్రం చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చింది. తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ రంగకృష్ణ, ఎస్ఐ సుభాష్‌గౌడ్ పరిశ్రమ వద్దకు చేరుకుని పరిశీలించారు.

ఒకరి పెన్షన్ డబ్బులు మరొకరికి..

● ఆరు నెలలుగా చెల్లింపు.. వృద్ధురాలి నిరసన



మాసాయిపేట. ఫిబ్రవరి19. (ఆంధ్రజ్యోతి): వితంతు పెన్షన్‌ను బ్యాంకు అధికారులు గత ఆరు నెలలుగా మరొకరికి చెల్లిస్తుండడంతో బాధితురాలు బుధవారం బ్యాంకు ఎదుట ఆందోళనకు దిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రమైన మాసాయిపేటకు చెందిన శేషని పెంటమ్మ(61)కు ఆరోగ్యం సరిగా లేకపోవటంతో 6 నెలులుగా గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. బుధవారం గ్రామానికి వచ్చిన ఆమె తన వితంతు పెన్షన్ డబ్బుల కోసం మాసాయిపేట కెనరా బ్యాంకుకు వెళ్లింది. తన పెన్షన్‌ను మరొకరికి చెల్లించినట్లు తేలడంతో ఒక్కసారిగా షాక్‌కు గురైన ఆమె బ్యాంకు అధికారులను నిలదీసింది. తన డబ్బులను చెల్లించాలంటూ బ్యాంకు ఎదుట నిరసనకు దిగింది. ఈ విషయమై విచారణ జరిపి త్వరలోనే బాధితురాలికి న్యాయం చేస్తామని బ్యాంకు మేనేజర్ నవీన్‌రెడ్డి తెలిపారు. దీనికి కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

30 ఏళ్లు దాటాయా..
వైద్య పరీక్షలకు రండి

- బీపీ, షుగర్, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు
- నేటి నుంచి మార్చి 31 వరకు ప్రత్యేక డ్రైవ్
- అన్ని ఆరోగ్య కేంద్రాలు, ఎన్‌సీడీ క్లీనిక్‌లలో పరీక్షలు
- వైద్య ఆరోగ్య శాఖ, ఎన్‌హెచ్‌ఎం కింద నిర్వహణ
- సంగారెడ్డి జిల్లాలో ఇప్పటికే 92 శాతం స్ర్కీనింగ్
- వందశాతం పూర్తి చేయడమే లక్ష్యంగా కార్యాచరణ



సంగారెడ్డి జీజీహెచ్‌లోని ఎన్‌సీడీ క్లినిక్‌లో పేషెంట్లకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా అధిక రక్తపోటు (బీపీ), మధుమేహం(షుగర్)తో పాటు వివిధ రకాల క్యాన్సర్ల బారిన ప్రజలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో అసంక్రమిత వ్యాధుల(నాన్‌కమ్యూనికేబుల్ డిసీజెస్-ఎన్‌సీడీ)ను కట్టడి చేసేందుకు వైద్య ఆరోగ్య శాఖ జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్‌ఎం) కింద ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో 30 ఏళ్లు దాటిన ప్రజలందరికీ ఎన్‌సీడీ పరీక్షలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఎన్‌సీడీ స్ర్కీనింగ్‌పై కార్యాచరణ రూపొందించింది.

నేటి నుంచి మార్చి 31 వరకు

ఈనెల 20వ తేదీ నుంచి మార్చి 31 వరకు 40 రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా ఎన్‌సీడీ పరీక్షలు చేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేసింది. బీపీ, షుగర్, మూడు రకాల క్యాన్సర్ పరీక్షలను చేయనున్నారు. బీపీ, షుగర్ నిర్ధారణ అయితే అక్కడికక్కడే మందులు అందజేస్తారు. వివిధ రకాల క్యాన్సర్ లక్షణాలు అనుమానంగా ఉంటే మమ్మోగ్రఫీ, కోల్పోస్కోపి పరీక్షలు చేస్తారు. నిర్ధారణ అయితే చికిత్సలు, మందులు అందజేస్తారు.

ఆరోగ్య కేంద్రాలు, ఎన్‌సీడీ క్లినిక్‌లలో

జిల్లాలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు(ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు), పల్లెదవాఖానాలు, సర్కారు దవాఖానాల్లో ఏర్పాటు చేసిన ఎన్‌సీడీ క్లినిక్‌లలో అసంక్రమిత వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేస్తారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని ఎన్‌సీడీ క్లీనిక్‌లోనూ బీపీ, షుగర్‌తో పాటు నిపుణులైన వైద్యుల చేత వివిధ రకాల క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

వివిధ దశల్లో కార్యక్రమం

అసంక్రమిత వ్యాధులు నిర్ధారణ కార్యక్రమం కొన్నేళ్లుగా వివిధ దశల్లో నిర్వహిస్తూ వస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో ఇప్పటివరకు 92 శాతం మంది ప్రజలకు పరీక్షలను పూర్తి చేశారు. వంద శాతం పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం నిర్దేశించి మార్గదర్శకాలను జారీ చేసింది. సంగారెడ్డి జిల్లాలో 30 ఏళ్లు దాటి వారు 8,01,330 మంది ఉండగా, ఇప్పటి వరకు 7,33,740 మందికి ఎన్‌సీడీ స్ర్కీనింగ్ నిర్వహించగా, ఇందులో 73,313 మందికి బీపీ, 35,563 మంది షుగర్, 72 మంది ఓరల్ క్యాన్సర్, 58 మంది బ్రెస్ట్ క్యాన్సర్, 53 మంది సర్వైకల్ క్యాన్సర్, 145 మంది ఇతరత్ర క్యాన్సర్ లక్షణాలతో బాధపడుతున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ గుర్తించింది.

అన్ని ఆరోగ్య కేంద్రాల్లో స్ర్కీనింగ్‌కు ఏర్పాట్లు



ఎన్‌సీడీ స్ర్కీనింగ్‌ను వంద శాతం పూర్తి చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగా, జిల్లా వ్యాప్తంగా అన్ని ఆరోగ్య కేంద్రాల్లో స్ర్కీనింగ్‌కు ఏర్పాట్లు చేశాం. పరీక్షలకు అవసరమైన బీపీ, యంత్రాలు, గ్లూకోమీటర్లు, షుగర్ స్ట్రిప్స్ అందుబాటులో ఉంచాం. ప్రాథమిక దశలో వ్యాధి గుర్తిస్తే బాధితులకు మేలు జరుగుతుంది. 30 ఏళ్లు దాటిన వారందరూ బీపీ, షుగర్ పరీక్షలు చేసుకుని చికిత్స తీసుకోవాలి.

-డా.శశాంక్‌దేశ్‌పాండే,
ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్, సంగారెడ్డి జిల్లా

కేంద్రీయ విద్యాలయానికి అనువైన స్థలాన్ని గుర్తించాలి

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

హవేళిఘణపూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : కేంద్రీయ విద్యాలయాన్ని నిర్మించేందుకు అనువైన స్థలాన్ని గుర్తించే ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం హవేళిఘణపూర్ శివారులో స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయం నిర్మాణానికి ఐదెకరాల స్థలం అవసరం ఉందన్నారు. దీనికి సంబంధించిన నివేదికలు తయారు చేసి దాని ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట మెదక్ ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ సింధురేణుక, ఆర్ఐ అబేద్, తదితరులు ఉన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు


స్వామి వారిని దర్శించుకున్న నీలం మధు

ఐడీఏబొల్లారం ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఐడీఏబొల్లారం పట్టణ పరిధి బాలాజీనగర్ కాలనీలో వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించారు. బుధవారం ఉదయం నుంచి ఆలయంలో విశేష పూజలను నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల వారు స్వామి వారిని దర్శించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్ స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు దైవచింతన అలవర్చుకుంటే ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. పోటీ ప్రపంచంలో ఒత్తిడిని తట్టుకోవడానికి ఆలయాల సందర్శన ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ చంద్రారెడ్డి, కార్మిక విభాగం నాయకుడు వరప్రసాద్‌రెడ్డి, తలారి కృష్ణ, రాజ్‌గోపాల్, ధర్మారావు, బాలరాజు, మాజీ కౌన్సిలర్ సుజాతమహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డంపుయార్డు పనులు నిలిపివేయాలని
అర్ధనగ్న ప్రదర్శన

● గుమ్మడిదలలో 15వ రోజు కొనసాగిన నిరసన


గుమ్మడిదలలో అర్ధనగ్న ప్రదర్శన నిర్వహిస్తున్న గ్రామస్థులు

గుమ్మడిదల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ప్యారానగర్ డంపుయార్డ్ పనులను నిలిపివేయాలని జేఏసీ ఆధ్వర్యంలో గుమ్మడిదలలో బుధవారం అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. జేఏసీ కన్వీనర్ చిమ్ముల జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో 15వ రోజు నిరసన కొనసాగించారు. మెదక్ - హైదరాబాద్ రోడ్డుపై బైఠాయించారు. గుమ్మడిదల, నల్లపల్లి గ్రామాల్లో రిలే నిరాహార దీక్షలను కొనసాగించారు. ప్రభుత్వం స్పందించి డంపుయార్డ్ పనులను ఆపే వరకు నిరసన పోరు కొనసాగుతుందని ఆందోళకారులు హెచ్చరించారు.

నర్సాపూర్‌లో ధర్నా

నర్సాపూర్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ప్యారానగర్ ప్రాంతంలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న డంపుయార్డుకు వ్యతిరేకంగా ఆందోళనలు మరింత ఉధృతం అవుతున్నాయి. ఇప్పటికే నర్సాపూర్‌లో అఖిలపక్షం ఆధ్వర్యంలో డంపుయార్డు వద్దంటూ రిలే నిరాహార దీక్షలు చేస్తున్న విషయం తెలిసిందే. తాజాగా బుధవారం డంపుయార్డు ఏర్పాటు చేస్తున్న నల్లవల్లి, ప్యారానగర్ గ్రామాలకు చెందిన వారంతా మహిళలతో పాటు నర్సాపూర్ పట్టణానికి వచ్చి బస్టాండు సమీపంలో జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. డంపుయార్డుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వీరికి మద్దతుగా స్థానిక జేఏసీ నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు. నర్సాపూర్‌లో మూడోరోజు దీక్షలో పలువురు అఖిలపక్షం నాయకులు పాల్గొన్నారు.

మెదక్‌లో ఇంటర్ మూల్యాంకన కేంద్రం

- ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో సెంటర్
- ఉత్తర్వులు జారీ చేసిన ఇంటర్ బోర్డు
- తొలగిన భారం.. తీరనున్న అధ్యాపకుల ఇబ్బందులు


మెదక్‌లోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మెదక్ జిల్లాకు ఇంటర్మీడియట్ మూల్యాంకన కేంద్రాన్ని మంజూరు చేసింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈసారి నుంచే మెదక్‌లోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల సెంటర్‌గా మూల్యాంకనం చేయనున్నారు.

ప్రతీ ఏడాది దాదాపు 150 మంది విధుల్లో

ఉమ్మడి మెదక్ జిల్లాకు సంబంధించి ఇంటర్ వాల్యూయేషన్ సంగారెడ్డి జిల్లాలో కొన్నాళ్ల పాటు కొనసాగింది. ఆ తర్వాత హైదరాబాద్‌కు మార్చారు. దీంతో మెదక్ నుంచి 100 కిలోమీటర్ల దూరంలోని ఈ కేంద్రానికి వెళ్లాలంటే అధ్యాపకులు ఆపసోపాలు పడేవారు. పేపర్ సంఖ్య, బోధనలో కనీసం రెండేళ్ల అనుభవం ఆధారంగా ఇంటర్ విద్యార్థులకు బోధించే అన్ని కేటగిరీల ప్రభుత్వ అధ్యాపకులకు మూల్యాంకన విధులు కేటాయిస్తారు. ప్రతీ ఏడాది జిల్లా నుంచి దాదాపు 150 మంది వెళ్లేవారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 6 పేపర్ల చొప్పున ఉంటాయి. 30 రోజుల పాటు క్యాంపు కొనసాగితే.. కొందరు గత్యంతరం లేక అక్కడే ఉండేవారు. మరికొందరు రాకపోకలు సాగించేవారు, ఇంకొందరు అనారోగ్య సమస్యలు, ఇతర కారణాలు చూపుతూ విధులను ఉపసంహరించుకునేవారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ అధ్యాపకుల సంఘం ద్వారా ఇంటర్ బోర్డు అధికారులతో పాటు స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు పలుమార్లు ఇంటర్ విద్యాశాఖ దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఎట్టకేలకు జిల్లాకు మూల్యాంకన కేంద్రాన్ని మంజూరు చేశారు. దీంతో ఇక్కడి అధ్యాపకుల బాధలు తొలగనున్నాయి. అయితే, రాష్ట్రంలో ఈసారి రెండు కేంద్రాలను మంజూరు చేయగా అందులో మెదక్ ఒకటి.

ఆదర్శంగా నిలుద్దాం



ఇంటర్మీడియట్ జవాబుపత్రాల వాల్యూయేషన్ సెంటర్ ఏర్పాటుతో అధ్యాపకులకు ప్రయాణ భారం తగ్గనుంది. జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు చొరవతో ఇది సాధ్యమైంది. కేంద్రాన్ని విజయవంతంగా నిర్వహించి ఆదర్శంగా నిలుద్దాం.

- మాధవి, ఇంటర్ ఇన్‌చార్జి జిల్లా నోడల్ అధికారి

ఈసారి నుంచే అందుబాటులోకి

ఈసారి నుంచి జిల్లా కేంద్రంలో స్పాట్ వాల్యూయేషన్ అందుబాటులోకి రానుంది. వచ్చే నెల మార్చి 5 నుంచి 23 వరకు ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. అదే నెల 7వ తేదీ నుంచి నెల రోజుల పాటు మెదక్‌లో మూల్యాంకన కేంద్రం నిర్వహించనున్నారు. డీఐఈవో మాధవి క్యాంపు అధికారిగా ఉండనున్నారు. సబ్జెక్టుకు ఒకరు చొప్పున కోడింగ్ అధికారులను నియమిస్తారు. మూల్యాంకనం చేసేవారి అసిస్టెంట్ వాల్యూయేషన్ ఆఫీసర్ అంటారు. ఐదు నుంచి ఎనిమిది మందికి ఒకరు చీఫ్ ఎగ్జామినర్ ఉంటారు. ర్యాండంగా పేపర్ మూల్యాంకనం పరిశీలిస్తారు. దాదాపు 30 రోజుల పాటు క్యాంపు కొనసాగనుంది. మూల్యాంకన కేంద్రం జిల్లాకు మంజూరు కావడం పట్ల ప్రభుత్వ అధ్యాపకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీపతి సురేష్‌బాబు హర్షం వ్యక్తం చేశారు.

అంగన్‌వాడీల్లో ప్రీ స్కూల్ విద్య

- పిల్లలకు నెలకో అంశంపై మెళకువల బోధన
- నేర్పించేందుకు టీచర్లకు శిక్షణ
- పాఠశాలలపై ఆసక్తి కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు



టీచర్లకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రీ స్కూల్ విద్యా విధానం ద్వారా పిల్లలకు వివిధ అంశాలపై మెళకువలను నేర్పించనున్నారు. చిన్నారులలో ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడం కోసం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో టీచర్లకు, హెల్పర్లకు శిక్షణ ఇవ్వడంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలలో ఉండే పిల్లల తల్లిదండ్రులను కూడా భాగస్వామ్యులను చేయనున్నారు.

చక్కటి వాతావరణంలో విద్యా బోధన



పిల్లలకు భయంతో కూడిన విద్యను అందిస్తే, అనేక సమస్యలు ఏర్పడతాయి. ఆటలు ఆడిస్తూ, పాటలు పాడిస్తూ చక్కటి వాతావరణంలో బోధన చేయడమే మా ప్రయత్నం. ఇప్పటికే టీచర్లకు శిక్షణనిస్తూ అవగాహన కల్పించాం. రిలయన్స్ ఫౌండేషన్ సహాయం అందించడంతో ఇంకా సులభమైంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలను తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు తమ సహాయం అందించాలి.

- శారద, సీడీపీవో, సిద్దిపేట జిల్లా

టీచర్లకు, హెల్పర్లకు రెండు రోజుల శిక్షణ

సిద్దిపేట ప్రాజెక్టులో 11 సెక్టార్‌లు ఉండగా, 267 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆయా మండలాల వారీగా ప్రతి సెక్టార్‌లో టీచర్లకు, హెల్పర్లకు రెండు రోజులపాటు శిక్షణ కూడా ఇచ్చారు. టీచర్లతో సీడీపీవో, సూపర్ వైజర్, ఏసీడీపీవోలకు కూడా ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు.

రిలయన్స్ ఫౌండేషన్ ద్వారా

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఐసీడీఎస్ అంగన్‌వాడీ కేంద్రాలలో సిద్దిపేట జిల్లాలో ఉన్న సిద్దిపేట ప్రాజెక్ట్, చేర్యాల ప్రాజెక్టును ప్రముఖ ఎన్జీవో సంస్థ అయిన రిలయన్స్ ఫౌండేషన్ ఎంచుకున్నది. ఈ సంస్థ క్రై అనే మరో ఎన్జీవో సంస్థతో భాగస్వామ్యమై సెక్టార్ పరిధిలో ఒక సీఆర్పీని నియమించి పర్యవేక్షణ చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను దత్తత తీసుకుని కావలసిన వస్తువులను, సామగ్రిని సమకూరుస్తున్నారు. సిద్దిపేట ప్రాజెక్టు పరిధిలోని 11 సెక్టార్‌లలో 11 మోడల్ కేంద్రాలుగా తీర్చిదిద్దనున్నారు. ప్రతీ నాలుగో శనివారం అంగన్‌వాడీ కేంద్రాలలో పేరెంట్స్ మీటింగ్ నిర్వహించి పిల్లలు నేర్చుకున్న మెలకువలను ప్రదర్శించేలా సీఆర్పీతో పర్యవేక్షణ చేస్తున్నారు. ఇంతకుముందు వారంరోజులకోసారి ఒక అంశంపై అవగాహన కల్పించే పద్ధతి ఉండేది. పిల్లలకు అర్థం కాకపోవడంతో నెలరోజులుకు ఒక అంశాన్ని బోధిస్తున్నారు. దీంతో దశలవారీగా అర్థమయ్యే పద్ధతిలో బోధించడానికి సమయం దొరుకుతుంది. గతంలో ఉండే అంశాల కంటే ఇప్పుడు కొన్ని కథలు, పాటలు కూడా అదనంగా బోధించడం ద్వారా పిల్లల్లో మరింత సృజనాత్మకత పెరిగే అవకాశం ఉంది.

పిల్లలకు మేథస్సు పెరిగేలా..

ఆడుతూపాడుతూ, కథలను చెబుతూ, బొమ్మలను గీయిస్తూ విద్యా బోధన చేయడం వలన పిల్లలకు అవగాహన కలగడంతో పాటు బ్రెయిన్ డెవలప్మెంట్ అయ్యే అవకాశం ఉందని ఐసీడీసీ అధికారులు చెబుతున్నారు. దీంతో పిల్లలకు బడి అంటేనే భయం పోతుంది. పిల్లలకు వారి సొంత పనులను చేసుకునేలా అవగాహన కల్పిస్తారు. చేతులు కడుక్కోవడం, దుస్తులు వేసుకోవడం, తల దువ్వుకోవడం, గోర్లు కత్తిరించుకోవడం, మరుగుదొడ్లను ఉపయోగించుకోవడం, అన్నం తినడాన్ని నేర్పిస్తారు. మౌఖికంగా కథ చెప్పడం, బొమ్మలు గీయడం, సంఖ్యలను చెప్పడం, తల్లిదండ్రులతో ఆటలు ఆడించడం వంటి అంశాలపైనా అవగాహన కల్పిస్తున్నారు.

పాఠశాలలను సందర్శించిన ఎంఈవోలు

మర్కుక్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అంగడికిష్టాపూర్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను బుధవారం ఎంఈవో వెంకటరాములు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలకిషన్, సీఆర్పీ అంజలితో కలిసి మధ్యాహ్న భోజన నిర్వహణ తీరు, విద్యార్థుల ప్రతిభ, కనీస సామర్థ్యాలను స్వయంగా పరిశీలించారు.

● దౌల్తాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోనాపూర్‌లో ప్రాథమిక పాఠశాలను ఎంఈవో గజ్జల కనకరాజు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులందరిని తెలుగు, ఇంగ్లీష్, గణితంలోని అంశాలను విద్యార్థులతో చదివించారు. పాఠశాల రికార్డులను పరిశీలించి మధ్యాహ్న భోజన నిర్వహణను పరిశీలించారు.

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా సత్తయ్య

మర్కుక్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కాశిరెడ్డిపల్లి మాజీ సర్పంచ్ నిర్మల్ పురస్కార్ అవార్డు గ్రహీత సింగం సత్తయ్యను రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నియమిస్తూ రాష్ట్ర బీజేపీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా నియమించినందుకు రాష్ట్ర అధినాయకత్వం కేంద్ర మంత్రివర్యులు కిషన్‌రెడ్డికి, ఎంపీలు ఈటల, రఘునందన్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎల్ఐసీ బ్రాంచ్ ఉద్యోగుల యూనియన్ కార్యవర్గం

హుస్నాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ ఎల్ఐసీ బ్రాంచ్ ఎంప్లాయిస్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పెద్ది సదాశివరెడ్డి, ఉపాధ్యక్షులుగా వి కరుణాకర్, కార్యదర్శిగా బి రాజేశ్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా వి వెంకటరాజం, ఎస్ అశోక్‌కుమార్, కోశాధికారిగా వెల్లండి కిషన్, కార్యవర్గ సభ్యులుగా రాజేంద్రప్రసాద్, శంకర్‌కుమార్, రేవతిలను ఎన్నుకున్నారు.

సిద్దిపేటను టాప్‌లో నిలపాలి

గజ్వేల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో సిద్దిపేట జిల్లా టాప్‌లో నిలవాలని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ వంటేరు ప్రతా‌ప్‌రెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇటీవల హర్యానా రాష్ట్రంలో నిర్వహించిన జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారిణి రాణిని శాలువాతో ఆయన సత్కరించారు. ఆయన వెంట నాయకులు హైదర్‌పటేల్, శివకుమార్, మల్లేశం, మహేశ్ తదితరులున్నారు. గజ్వేల్ మండలంలోని దర్గారెడ్డిపల్లి గ్రామానికి కిరణ్, వర్గల్ మండలం చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్ ఇటీవల ఆత్మహత్యకు పాల్పడగా మృతుల కుటుంబాలను బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రతాప్‌రెడ్డి పరామర్శించి, ఓదార్చారు.

సీసీరోడ్డును నిర్మించాలి

సిద్దిపేట, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): సీసీరోడ్డును ఏర్పాటు చేసి కాలనీవాసుల సమస్యలను పరిష్కరించాలని మహిళలు డిమాండ్ చేశారు. బుధవారం మిరుదొడ్డిలో మహిళలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని గొల్ల బాలయ్య కాలనీలో సీసీ రోడ్డు లేక పోవడంతో తీవ్రఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. అధికారులు స్పందించి సీసీరోడ్డును ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు.

ఇరుకు వంతెనతో ఇక్కట్లు

- సిరిసిల్ల-సిద్దిపేట రోడ్డులో తరచూ ప్రమాదాలు
- ప్రముఖ క్షేత్రం వేములవాడకు ఇదే ప్రధానరహదారి
- భయాందోళనలో వాహనదారులు
- దశాబ్దాలు గడిచినా పట్టించుకోని వైనం




మల్యాల శివారులో మూలమలుపుతో కూడిన ఇరుకు వంతెన, భారీలోడ్‌తో వంతెనపై నుంచి వెళ్తున్న వాహనాలు

సిద్దిపేట రూరల్,ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉన్న పలు ప్రధాన రాహదారులపై పాత వంతెనలు శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారాయి. దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెనలు కావడం వల్ల ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా లేక ఇరుకుగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు.

పట్టించుకునేవారేరీ..?

నారాయణరావుపేట మండలం అది పేరుమాండ్ల ఆలయం వద్ద మల్యాల- రామంచ రెండు గ్రామాల శివారులో సిద్దిపేట-సిరిసిల్ల ప్రధాన రహదారిపై కొన్నేళ్లుగా వంతెన నిర్మాణం చేపట్టక పోవడంతో రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీ కారణంగా తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఒక్క వరుస రోడ్డుగా ఉన్నప్పుడు నిర్మించిన వంతెన దశాబ్దాలు గడిచినా పాలకులు, అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని అయా గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు.

ఇరుకు బ్రిడ్జి.. ఆ వెంటనే మూలమలుపు

ఓ వైపు వంతెన ఇరుకుగా ఉండడం, మరోవైపు అదే ప్రదేశంలో రోడ్డు మూల మలుపులతో ప్రమాదకరంగా మారి నెలలో సగటున సుమారు నాలుగైదు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వర్షాకాలంలో భారీ వర్షాల సమయంలో, చలి కాలం మంచు కమ్ముకున్న సమయంలో రోడ్డు కనిపించకపోవడంతో ఇరుకు వంతనే వద్దకు రాగానే ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇరుకుగా బ్రిడ్జి ఉండడంతో పాటు ఆ వెంటనే మూలమలుపు ప్రమాదకరంగా ఉంది. ఇప్పటికే వంతెన వద్ద మినీ, భారీ వాహనాలు అదుపు తప్పి వంతెన సైడ్ వాల్స్ ఢీకొన్న ఘటనలు కోకొల్లలు. ప్రమాదాల్లో ప్రాణ నష్టం జరగనప్పటికీ తీవ్ర గాయాలతో ఎంతోమంది బయటపడ్డారు. వాహనాలు సైతం తీవ్రంగా ధ్వంసమైనట్లు బాధితులు చెబుతున్నారు.

వేములవాడకు ప్రధాన రహదారి..

తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ క్షేత్రం వేములవాడ రాజన్న ఆలయానికి వెళ్లేందుకు సిద్దిపేట-సిరిసిల్ల రోడ్డు ప్రధాన రహదారి. కాగా నిత్యం వేలకొద్ది వాహనాల్లో ఈ రోడ్డు గుండా వేములవాడకు భక్తులు రాకపోకలు సాగిస్తారు. ఇంతటి ప్రాముఖ్య ఉన్న ఈ రహదారిపై మల్యాల శివారు ఆదిపేరుమాండ్ల ఆలయం సమీపంలో ఉన్న ఇరుకు వంతెన, మూలమలుపు వద్దకు రాగానే వాహన చోదకులు ఏమాత్రం ఆదమరిచినా తీవ్ర ప్రమాదాలు తప్పవు. ఈ రోడ్డు గ్రామాలకు దూరంగా ఉండడంతో రాత్రిపూట ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులు ఇబ్బందులు పడిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. గతంలో సిరిసిల్ల-సిద్దిపేట రోడ్డు విస్తరణ చేసినప్పటికీ, నిర్మాణ సమయంలో అధికారులకు ముందు చూపు కరువైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వారి నిర్లక్ష్యం వాహనదారుల పాలిట ప్రాణసంకటంగా పరిణమించింది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు దృష్టి సారించి ఇరుకువంతెన వద్ద ఇబ్బందులను తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఇదే విషయమై ఆర్ అండ్ బీ అధికారులను వివరణ కోరగా త్వరలో జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా వంతెన నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

బ్రిడ్జి విస్తరణ చేసి నిర్మాణం చేపట్టాలి



నిత్యం వందల సంఖ్యలో వాహనాలు సిరిసిల్ల-సిద్దిపేట రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తాయి. బ్రిడ్జి వద్దకు రాగానే వాహనాలు ఒకేసారి స్పీడ్ కంట్రోల్ కాకపోవడంతో బ్రిడ్జి సైడ్ వాల్స్‌ను ఢీకొని చాలా ప్రమాదాలు జరిగాయి. చిన్న చిన్న ప్రమాదాలు జరిగినప్పుడు ఎవరికీ తెలియదు. పెద్దవాహనాలు బ్రిడ్జి సైడ్‌వాల్స్ ఢీకొని రోడ్డుకు అడ్డంగా పడినప్పుడు మాత్రం కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ తప్పదు. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ముందస్తుగా బ్రిడ్జి నిర్మాణం పనులు చేసి ప్రమాదాలను నివారించాలి.

- అజయ్‌రెడ్డి, మల్యాల వాసి

పనులు చేశాం.. పైసలివ్వండి



దొమ్మాట జడ్పీ పాఠశాలలో పూర్తిచేసిన మరుగుదొడ్లు

దౌల్తాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థానిక సంస్థల పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేసింది. వాటి ద్వారా పాఠశాలలో తాగునీరు మూత్రశాలలు, మరుగుదొడ్లు, ప్రహరీలు, వంట గదులు విద్యుత్, రంగులు వేయడం తదితర అభివృద్ధి పనులు చేపట్టారు. దౌల్తాబాద్ మండల పరిధిలోని దొమ్మాట జడ్పీ పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీ అధ్యక్షురాలు బిచ్చంగారి భాగ్యలక్ష్మి పాఠశాలలో మూత్రశాలలు, మరుగుదొడ్లు వంటగది నిర్మాణానికి రూ.4.15 లక్షలు వడ్డీకి తీసుకొచ్చి పనులు పూర్తి చేశారు. పాఠశాలలో చేసిన పనులకు మొదటి విడతలో రూ.2 లక్షలు మాత్రమే విడుదలయ్యాయి. మిగతా డబ్బు రాకపోవడంతో తీసుకొచ్చిన డబ్బుకు వడ్డీ కట్టలేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయింది. పంచాయతీ, జిల్లా కలెక్టర్ ఆఫీస్ కు ఎన్నిసార్లు తిరిగినా స్పందించడం లేదని వాపోయింది. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని మేము చేసిన పనులకు డబ్బులు చెల్లించాలని కోరుతున్నారు.

రేపటి నుంచి పెద్దమ్మ కల్యాణోత్సవాలు

రాయపోల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ మండలం అనాజీపూర్ గ్రామంలో నెలకొల్పిన పెద్దమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవం ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్నాయి. ఆలయ వార్షికోత్సవాల కోసం ముదిరాజ్ సంఘం సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవాల సందర్భంగా ఆలయం ముందు చలువ పందిరి వేశారు. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు శుక్రవారం ఉదయం గణపతి పూజ, అఖండ దీప స్థాపన తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. చివరి రోజైన ఆదివారం మహాపూర్ణాహుతి అనంతరం పెద్దమ్మ పెద్దిరాజుల శాంతి కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ముదిరాజ్ సంఘ సభ్యులు తెలిపారు.

పొద్దు తిరుగుడులో గంధకం వాడకంతో అధిక దిగుబడి



పొద్దుతిరుగుడులో గంధకం వాడకంపై క్షేత్ర ప్రదర్శన నిర్వహిస్తున్న శాస్త్రవేత్త పల్లవి తదితరులు

చిన్నకోడూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పొద్దు తిరుగుడులో గంధకం (సల్ఫర్) వాడకంతో గింజ బరువు పెరిగి నూనె శాతం పెరుగుతుందని ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానం, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త పల్లవి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని రామంచ గ్రామంలో ఓ రైతు పొద్దు తిరుగుడులో గంధకం వాడకంపై క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. యాసంగిలో తక్కువ నీటితో పొద్దు తిరుగుడు సాగు చేయవచ్చని తెలిపారు. అనంతరం వివిధ రకాల పంటల సాగులో పలువురు రైతుల సందేహాలను ఆమె నివృత్తి చేశారు.

మందుల వాడకంపై జాగ్రత్తలు పాటించాలి

మద్దూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : రైతులు తమ పంట పొలాల్లో క్రిమిసంహారక మందులు వినియోగించినప్పుడు జాగ్రత్తలు పాటించాలని సేల్స్ ఆఫీసర్స్ గడిపె అనిల్‌కుమార్, శ్రీనివాస్ సూచించారు. బుధవారం మద్దూరు మండలంలోని సలాఖ్‌పూర్‌లో ఇన్సెక్టిసైడ్ ఇండియా లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో క్రిమిసంహారక మందుల పిచికారి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు భాస్కర్, నాగరాజు, ఉపేందర్‌తో పాటు రైతులు పాల్గొన్నారు



చేర్యాలలో అసంపూర్తిగా నిలిచిన వైకుంఠధామం పనులు

'చితి' తంటాలు

(5వ పేజీ తరువాయి)

దీంతో గద్దెల చుట్టూ పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి. గదులు, స్నానపు గదులు ధ్వంసమవుతున్నాయి. లక్షలాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగమవుతున్నది.

అధికారులు దృష్టిసారిస్తేనే..

వైకుంఠధామాల నిర్వహణపై అధికార యంత్రాంగం దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గ్రామాల ప్రత్యేకాధికారులు, కార్యదర్శులకు ఆదేశాలిచ్చి వైకుంఠధామాల వద్ద శుభ్రం చేయించాలి. చుట్టూ మొక్కలు నాటించడం, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయించడంపై దృష్టి పెట్టాలి. బోర్లలో నీళ్ల ఉన్నప్పటికీ వృథాగానే ఉన్నాయి. సమీపంలోనే వైకుంఠధామాలు ఉన్నప్పటికీ అంత్యక్రియలు చేయడానికి ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొన్నది. పంచాయతీ నిధులతోనో, ఇతర ప్రత్యేక నిధుల ద్వారానో వైకుంఠధామాలను వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

గజ్వేల్ రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటోనామస్)లో బుధవారం జరిగిన జాబ్‌మేళాకి విశేష స్పందన వచ్చిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజుం తెలిపారు. కళాశాల టీఎస్‌కేసీ, టీఏఎస్‌కే, ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో హైదరాబాద్ యాక్సిస్ బ్యాంక్ జాబ్ మేళాలో నిరుద్యోగులు, కళాశాల విద్యార్థులు 150మంది పాల్గొన్నారని తెలిపారు. 12 మంది కళాశాల విద్యార్థులు, 13 స్థానిక నిరుద్యోగ అభ్యర్థుల సంస్థలోని వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో యాక్సిక్ బ్యాంక్ ప్రతినిధులుకుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గణపతిరావు, టీఎస్ కేసీ కోఆర్డినేటర్ కవిత, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటేష్, అకాడమిక్ కోఆర్డినేటర్ కెప్టెన్ భవాని, ప్లేస్‌మెంట్ అధికారి విజయభాస్కర్‌రెడ్డి, టీఎస్‌కేసీ మెంటర్ జబ్బర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా కబడ్డీ జట్టుకు రవాణా ఖర్చులు అందజేత



జట్టుకు నగదును అందజేస్తున్న మేకల కనకయ్య

మర్కుక్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): 34వ సబ్ జూనియర్ అంతర్‌జిల్లాల కబడ్డీ పోటీలకు వెళ్తున్న సిద్దిపేట జిల్లా బాలుర జట్టుకు రవాణా ఖర్చుల నిమిత్తం మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మేకల కనకయ్య రూ.10వేల ఆర్థిక సాయం అందజేసినట్లు ఏకలవ్య కబడ్డీ క్లబ్ అధ్యక్షుడు రాజబోయిన కృష్ణ యాదవ్ బుధవారం తెలిపారు. ఈ నెల 20నుంచి 23 వరకు వికారాబాద్ జిల్లాలో జరిగే పోటీల్లో జిల్లా జట్టు పాల్గొంటుంది.

మరాఠా యోధుడికి ఘన నివాళి



గజ్వేల్ మండలం కొడకండ్లలో శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న హిందూసంఘాల నాయకులు



కొండపాక: దుద్దెడలో హిందూ వాహిని, ఆరే సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతి



కుకునూరులో ర్యాలీకి హాజరైన హిందూ సంఘాల నాయకులు

న్యూస్‌నెట్‌వర్క్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మరాఠా వీరుడు ఛత్రపతి శివాజీ జయంతిని బుధవారం జిల్లా వ్యాప్తంగా పలు హిందూసంఘాలు, వివిధ పార్టీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మండల కేంద్రాలు, గ్రామాల్లో శివాజీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. యువకులు ఆయన చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి, ర్యాలీలు నిర్వహించారు. పలుచోట్ల విగ్రహస్థాపనకు భూమిపూజలు చేశారు. ఈ సందర్భంగా హిందూసంఘాల నాయకులు మాట్లాడుతూ హిందూధర్మ పరిరక్షణకు జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు, మొఘల్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన యోధుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ అని కొనియాడారు.



దూళిమిట్ట మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు, గ్రామస్థులు



మద్దూరులో బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో శివాజీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న నాయకులు

మత్తులో జీవితాలను నాశనం చేసుకోవద్దు



తొగుట: రాంపూర్ గురుకులంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ

తొగుట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): యువత మత్తులో మునిగి జీవితాలను నాశనం చేసుకోవద్దని తొగుట సీఐ లతీఫ్ సూచించారు. బుధవారం తొగుట-రాంపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ చదువుపై దృష్టి సారించాలని, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పిల్లలు మహిళలు ఏమైనా సమస్యలు ఇంట్లో కానీ బయట కానీ ఎదుర్కొంటే వెంటనే షీటీమ్ వాట్సాప్ నెంబర్ 8712667343, మహిళా పోలీస్ స్టేషన్ నెంబర్ 8712667435 కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అజ్మత్ బేగం, ఉపాధ్యాయులు, తొగుట ఏఎస్ఐ రాంరెడ్డి, గజ్వేల్ షీటీమ్ ఏఎస్ఐ శ్రీరాములు, మహిళా కానిస్టేబుల్ లావణ్య, కానిస్టేబుల్ మహేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

● చేర్యాల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుపై దృష్టిసారించాలని, సోషల్‌మీడియాకు బానిస కాకుండా అప్రమత్తంగా ఉండాలని చేర్యాల ప్రొబేషనరీ ఎస్ఐ మానసరెడ్డి అన్నారు. మండలంలోని కడవేరుగు జడ్పీఎస్ఎస్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు సోషల్‌మీడియా ప్రభావాలు, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, సైబర్ నేరాలు, మహిళా రక్షణ చట్టాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ నవీన్, షీటీమ్ బృందం, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్య ద్వారా బంగారు భవిష్యత్తు



నంగునూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాలిటెక్నిక్ కోర్సులపై అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపల్ గోవర్ధన్

నంగునూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ విద్య ద్వారా విద్యార్థులకు బంగారు భవిష్యత్తు లభిస్తుందని రాజగోపాలపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఎ. గోవర్ధన్ అన్నారు. బుధవారం నంగునూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పాలిటెక్నిక్‌లో ప్రవేశం, ఉపాధి అవకాశాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. పాలిటెక్నిక్‌లో ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్‌ను ప్రధానోపాధ్యాయుడు రామస్వామిగౌడ్‌తో కలిసి ప్రిన్సిపాల్ ఆవిష్కరించారు. పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలో ఉత్తమ ర్యాంకు సాధించి ప్రవేశం పొందాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

ఎడ్యూకేషన్ హబ్ సమస్యల పరిష్కారానికి కృషి



గజ్వేల్ పట్టణంలోని ఎడ్యూకేషన్ హబ్‌ను పరిశీలిస్తున్న నర్సారెడ్డి

గజ్వేల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఎడ్యూకేషన్ హాబ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌ను బుధవారం యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవితో కలసి ఆయన పరిశీలించారు. ఈ ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయలు వెచ్చించి ఎడ్యూకేషన్ హాబ్‌లు నిర్మించారని, కానీ ప్రస్తుతం నిర్వహణ లేక అనేక సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అనంతరం హబ్‌లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ప్రకటించారు.

లక్ష్మీవేంకటేశ్వరస్వామికి సారె సమర్పణ



ఒడి బియ్యం, పట్టు వస్త్రాల సమర్పణకు వెళ్తున్న మహిళా భక్త బృందం

హుస్నాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామికి బుధవారం హనుమాన్‌చాలీసా మహిళా భక్తబృందం ఒడి బియ్యం, పట్టు వస్త్రాలు సమర్పించారు. పట్టణంలోని పార్థసారథి గీతా మందిరం నుంచి మహిళలు ఊరేగింపుగా వెళ్లి సంకల్ప సహిత పూజలు చేసిన అనంతరం లక్ష్మీవేంకటేశ్వరస్వామికి సారెను సమర్పించారు. ఇందులో ఆలయ కమిటీతో పాటు హనుమాన్ చాలీసా మహిళా భక్త బృందం పాల్గొన్నారు.

తెలుగు డీటీపీ సర్టిఫికెట్ కోర్సు ప్రారంభం

సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో డీటీపీ ఫొటోషాప్ సర్టిఫికెట్ కోర్సు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. జి.సునీత మాట్లాడుతూ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడే ఫొటోషాప్, డీటీపీ సర్టిఫికెట్ కోర్సు నిర్వహిస్తున్నందుకు తెలుగు విభాగాన్ని అభినందించారు. అనంతరం తెలుగు విభాగాధిపతి డాక్టర్ మట్టా సంపత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ 30 రోజుల పాటు ఈ కోర్సు ఉంటుందని, తరగతులకు హాజరై ప్రాక్టీస్ చేసినప్పుడే పూర్తిగా నేర్చుకోగలుగుతారని వివరించారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శిక్షకులు జి.హరీశ్, తెలుగు అధ్యాపకులు పిట్ల దాసు, నారోజు వెంకటరమణ, నరేష్, సంపత్, రామస్వామి, శైలజ, సాయి సురేష్, రమణ, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమానికి కాంగ్రెస్ కృషి

హుస్నాబాద్‌రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిననాటి నుంచి గ్రామాల్లో ప్రజాపాలన, ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం పనిచేస్తుందని హుస్నాబాద్ ఏఎంసీ వైస్‌చైర్మన్, కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు బంక చందు పేర్కొన్నారు. బుధవారం హుస్నాబాద్ మండలం తోటపల్లి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసిన తోటపల్లి గ్రామంలో ఇందిరమ్మ పథకం ద్వారా మంజూరైన ఇళ్లకు భూమి పూజ చేశారు. తోటపల్లి గ్రామంలో ఇండ్లు లేని 120 మందికి ఇందిరమ్మ పథకం ద్వారా ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని వివరించారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీసభ్యులు దగ్గు రామారావు, పోలు నర్సయ్య, లోకిని యాదగిరి, పంపరి సంతప్, పోసవేని రాధిక తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన వంట సామగ్రి అందజేత

మద్దూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మద్దూరు మండలంలోని రేబర్తి ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ పరిధిలో గల పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన తయారీ నిర్వాహకులకు ప్రభుత్వం సరఫరా చేసిన వంట పాత్రలను బుధవారం అందించినట్లు పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం బి. చంద్రభాను తెలిపారు. ఈ విషయమై హెచ్‌ఎం మాట్లాడారు. లద్నూరు పీఎస్, హెచ్ఎస్, వల్లంపట్ల, వంగపల్లి, మర్మాములలోని పాఠశాలలకు వంట పాత్రలు వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో సీఆర్పీలు బాల్‌రాజ్, నగేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.